## క్లుప్తంగా

### డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పెనుకొండ: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని సెబ్ సీఐ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెబ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ బషీర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. యువత డ్రగ్స్‌తో అనారోగ్య సమస్యలు కోరి తెచ్చుకుంటున్నారన్నారు.

### వ్యాధి గుర్తింపుతో మెరుగైన చికిత్స

హిందూపురం: వ్యాధిని గుర్తించడం ద్వారా మెరుగైన వైద్యం అందించొచ్చని డాక్టర్లు చక్రతేజారెడ్డి, సుకన్య పేర్కొన్నారు. శుక్రవారం కిరికెర గ్రామంలో వాసవ్య మహిళామండలి, కుశాల్ హెల్త్‌కేర్ క్లినిక్ విప్రోకేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కుశాల్ ప్రాజెక్టు సిబ్బంది, సర్పంచ్ భాగమ్మ, కార్యదర్శి వేణుగోపాల్, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

### రోడ్డు ధ్వంసం చేశారని ధర్నా



ధర్నాలో పాల్గొన్న గుడిపల్లి గ్రామస్తులు

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి గ్రామంలో రోడ్డు ధ్వంసం చేస్తున్నారని నిరసిస్తూ గ్రామస్తులు శుక్రవారం ధర్నా చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ సమీపంలో టీడీపీ నాయకులు, మాజీ మంత్రి పరిటాల సునీత బంధువులు ఓ క్రషర్ నడుపుతున్నారు. అక్కడి నుంచి కంకర తరలిస్తూ నిత్యం అధిక లోడ్‌తో టిప్పర్‌లు రాకపోకలు సాగిస్తుండడంతో గుంతలమయంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ముధూళితో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, గ్రామస్తులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. గ్రామం మీదుగా అధిక లోడుతో విచ్చలవిడిగా వాహనాలు తిప్పితే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని స్థానికులు హెచ్చరించారు.

### వైఎస్సార్ బీమా అందజేత



సావిత్రమ్మకు నగదు అందిస్తున్న మధుమతిరెడ్డి

హిందూపురం అర్బన్: చౌళూరు గ్రామానికి చెందిన కదిరప్ప అనే వ్యక్తి మరణించడంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలు వైఎస్సార్‌సీపీ నేత మధుమతిరెడ్డి మృతుడి భార్య సావిత్రమ్మకు శుక్రవారం అందజేశారు. ఎంపీపీ రత్నమ్మ, సర్పంచ్ నంజప్ప, లోకేష్‌రెడ్డి, పవన్, వాసు, మంజు తదితరులు పాల్గొన్నారు.

### పురం తహసీల్దార్‌గా స్వర్ణలత



హిందూపురం టౌన్: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కొత్త తహసీల్దార్‌గా స్వర్ణలత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పెనుకొండలో పని చేస్తున్న ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తానన్నారు. ఈసందర్భంగా రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

### రొళ్ల తహసీల్దార్‌గా హసీనాసుల్తానా



రొళ్ల: రొళ్ల తహసీల్దార్‌గా ఆర్.ఎస్.హసీనా సుల్తానా శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ, ఆర్ఐ మంజునాథ్, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

పావగడ: మిలాద్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక జామియా షాదీ మహల్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం జరిగింది. ముస్లిం యువకులు 70 యూనిట్లకు పైగా రక్తదానం చేశారు. కౌన్సిలర్ మహ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ.. మహ్మద్ పైగంబర్ సేవా మనోభావాన్ని పుణికి పుచ్చుకుని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. జామియా మసీదు ముతవల్లి లతీబ్ సాబ్, కార్యదర్శి మహ్మద్ జబీద్, రియాజ్, షఫి, సికందర్, షాబాబు, రిజ్వాన్ పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక నిమజ్జనం



కొడిగెనహళ్లిలో వినాయక నిమజ్జనోత్సవ చివరి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



మడకశిరరూరల్: వినాయకుడి నిమజ్జనం



మడకశిరరూరల్: సిద్ధగిరిలో యువతుల నృత్యం



చిలమత్తూరులో వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం



ఇందిరమ్మ కాలనీలో గణపతిని ఊరేగిస్తున్న దృశ్యం



పావగడ: లడ్డూ వేలం నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిమజ్జనం చేశారు. తొలుత ఆయా ప్రాంతాల్లో గణపయ్యలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో కొలువుదీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం స్థానిక చెరువులో గణపయ్యలను నిమజ్జనం చేశారు.

మడకశిర: పట్టణంలో శుక్రవారం వినాయక నిమజ్జనానికి ఘనంగా జరిగింది. ప్రత్యేకంగా ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని అందులో విగ్రహాలను ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. పట్టణ సమీపంలోని చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

మడకశిరరూరల్: వివిధ గ్రామాల్లో ఐదు రోజుల పాటు పూజలందుకున్న గణపయ్యలను శుక్రవారం గంగ ఒడికి తరలించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లలో వినాయక విగ్రహాలను ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ డ్యాన్స్ చేశారు. అనంతరం పలు చెరువుల్లో వినాయకులను నిమజ్జనం చేశారు.

**పోటాపోటీగా లడ్డూ వేలం..**

పావగడ: వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలోని కల్యాన్ చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూను వేలం వేశారు. బలిజ గోపాలప్ప రూ.32,700లకు లడ్డూను దక్కించుకున్నారు.

పరిగి: మండలంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. సీతారాంపురం కాలనీ, కొడిగెనహళ్లి, శాసనకోట, గొరవనహళ్లి తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జనం జరిగింది.

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురంలో వినాయక నిమజ్జనం శుక్రవారం ఘనంగా జరిగింది. ఐదు రోజుల ప్రత్యేక పూజల అనంతరం వినాయక విగ్రహాలను రంగవల్లులు చల్లుతూ, బాణాసంచా పేలుస్తూ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.

చిలమత్తూరు: మండలంలో గణనాథుని నిమజ్జనం శుక్రవారం ఘనంగా జరిగింది. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో వినాయకుడిని ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. మహిళలు, యువకులు, చిన్నారులు నృత్యం చేస్తూ ముందుకుసాగారు. కొడికొండ చెక్‌పోస్ట్‌లో వినాయక నిమజ్జనం కోలాహలంగా జరిగింది.

గోరంట్ల: మండల కేంద్రంలో వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయకుడితో పాటు బస్టాండ్ సర్కిల్‌లో డ్రైవర్స్ అసోసియేషన్, విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు.

వినాయక లడ్డూ వేలం: స్థానిక చౌడేశ్వరి ఆలయ ఆవరణలో వినాయక సేవాసమితి ఆధ్వర్యంలో లడ్డూను వేలం వేశారు. గోరంట్లకు చెందిన మహేష్ అనే వ్యక్తి రూ. 2,17,000 వేలకు కైవసం చేసుకున్నాడు.

పెనుకొండ: పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆర్యవైశ్యులు పట్టణంలో వినాయకుడి విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఊరేగించి, అనంతరం భోగసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున కోలాహలం చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

హిందూపురం: కంసాలపేటలో విశ్వకర్మ వినాయక సేవాసమితి ఆహ్వానం మేరకు హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎస్.దీపిక, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి వెళ్లి అర్చనలు, పూజలు నిర్వహించి ప్రసాదాలను పంపిణీ చేశారు. బాలయేసు కళాశాల వద్ద శ్రీభారత్ వినాయక సేవా సమితి నిర్వాహకులు కొలువుదీర్చిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభించారు. నింకంపల్లి, కంసాలపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పూజలు చేసి అన్నదానం నిర్వహించారు.









చిలమత్తూరు: మరవకొత్తపల్లి ఎస్సీ కాలనీలో శోభాయాత్ర, నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకులు, వేడుకల్లో పాల్గొన్న సమన్వయకర్త టిఎస్.దీపిక, పెనుకొండలో వినాయకుడి ఊరేగింపు

## 30లోపు ఈ-క్రాప్ నమోదు చేయాలి

పరిగి: రైతులు ఈనెల 30లోపు ఈ పంట నమోదు చేయించుకోవాలని ఏఓ విజయభారతి తెలిపారు. మండలంలోని శ్రీరంగరాజుపల్లి, మోదా రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పలు రైతుల పొలాలను సందర్శించారు. ప్రజాప్రతినిధులు, ఆర్బీకే సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అగళి: ఈనెల 30లోపు ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఏఓ శేఖర్ నాయక్ సూచించారు. మధుడి, రామాపురం, అగళి, ఆర్‌జీ హళ్లి ఆర్‌బీకే కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాగు చేసిన పంటలను పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. వీఏఏలు పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు ఈ-కేవైసీ కూడా పూర్తి చేయాలన్నారు.



ఈక్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ విజయభారతి

గుడిబండ: ఖరీఫ్‌లో పంటల సాగు చేసిన రైతులు ఈనెల 30వ తేదీలోపు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వీర నరేష్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని తాళికెర, మోరుబాగల్, గుణేమోరుబాగల్ గ్రామ పంచాయతీల్లో నమోదు చేసిన పంటలను పరిశీలించారు.

## పోలింగ్ కేంద్రాల మార్పునకు సహకరించండి

హిందూపురం టౌన్: హిందూపురం నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల మార్పులు, పేర్ల మార్పునకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్ కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జేసీ మాట్లాడుతూ హిందూపురం మండల పరిధిలో 1, అర్బన్‌లో 13, లేపాక్షి మండలంలో 2, చిలమత్తూరు మండలంలో 2 పోలింగ్ కేంద్రాలను మార్పు చేస్తున్నామన్నారు. అలాగే హిందూపురం రూరల్‌లో 2, చిలమత్తూరు మండలంలో 14 పోలింగ్ కేంద్రాల పేర్లను మార్పు చేస్తున్నామని తెలిపారు. త్వరితగతిన ఈ ప్రక్రియ ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరేంద్ర, సెరికల్చర్ ఏడీ సురేష్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్, ఎన్నికల సీఏ శ్రీనివాసరెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్

## మహిళా సంఘాల బలోపేతానికి కృషి



ఎంపికైన హేమ మండల సమాఖ్య నూతన కార్యవర్గ సభ్యులు

అమరాపురం: మండలంలో మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేద్దామని ఏపీఎం తిప్పన్న తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో హేమ మండల సమాఖ్య వార్షికోత్సవ మహాసభను అధ్యక్షురాలు లలితమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం తిప్పన్న మాట్లాడుతూ.. అధికారులు, వీఓ లీడర్లు కలసి సంఘాలను బలోపేతం చేయాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ప్రగతి వివరాలను చదివి వినిపించారు. అలాగే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, లబ్ధిని తెలిపారు.

**నూతన కార్యవర్గం ఎంపిక..**

అమరాపురం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం హేమ మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా ఆలదపల్లి చెందిన కళ్యాణి, కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా లక్ష్మీదేవి, సహాయక కార్యదర్శిగా ముద్దీరమ్మ, ఉపాధ్యక్షురాలిగా పార్వతమ్మ ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

## ఆరోగ్య సురక్ష సర్వే వందశాతం చేయాలి



కొండాపురంలో ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథగుప్త, తదితరులు

గోరంట్ల: ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను వలంటీర్లు, వైద్యసిబ్బంది వందశాతం చేయాలని ఎంపీడీఓ రఘునాథగుప్త తెలిపారు. శుక్రవారం మండలంలోని కొండాపురం గ్రామంలో వలంటీర్లు, వైద్యసిబ్బంది చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేలో తీసుకోవాల్సి జాగ్రత్తలను ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వలంటీర్లు, వైద్యసిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రొద్దం: మండలంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షపై సర్వే పక్కాగా ఉండాలని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ అన్నారు. శుక్రవారం కోగిర, నారనాగేపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షను ఎంపీడీఓ తనిఖీ చేశారు. సురక్ష సర్వేపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కేశవరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

## విభిన్న 'ప్రతిభా'వంతులకు అభినందన

హిందూపురం టౌన్: జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన పిల్లలకు శుక్రవారం స్థానిక ఎంజీఎం పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో అభినందన సభ నిర్వహించారు. పుట్టపర్తిలో గురువారం జిల్లా స్థాయి పోటీల్లో బాలికల విభాగంలో రన్నింగ్ రేస్‌లో విభిన్న ప్రతిభావంతురాలు సుహాన తృతీయ స్థానం, షాట్‌పుట్ అండ్ రన్నింగ్ రేస్‌లో ఆజామ్ తృతీయ, అలాగే పునీత్ కుమార్, సుఫియాన్‌లు విజేతలుగా నిలవడంతో ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ, కౌన్సిలర్ రమేష్ వారిని సత్కరించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంజీఎం, దుర్గాబాయి దేశ్‌ముఖ్, పొట్టిశ్రీరాములు పాఠశాలల హెచ్‌ఎంలు సామ్రాజ్యం, రమాదేవి, సూర్యనారాయణ, భవిత పాఠశాల ఐఈఆర్టీ లలిత పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను అందజేస్తున్న దృశ్యం

## ఇంటింటా 'జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే'

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి కోరారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశమయ్యారు. జగనన్న ఆరోగ్య సురక్ష అమలుపై సమీక్షించారు. వలంటీర్లు, ఉద్యోగులు సమష్టిగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజలు ఆరోగ్య సమస్యలను తెలుసుకోవాలన్నారు. సమావేశంలో డాక్టర్లు మాధుర్య, వెంకటేశ్వర్లు, వినోద్, జయవర్ధన్, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటా సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీఓ సోనిబాయి తెలిపారు. శుక్రవారం కదిరేపల్లి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేపై వలంటీర్లు, వైద్య, సచివాలయం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఇంటింటా సర్వేకు ప్రజలు సహకరించి ఆరోగ్య సమస్యలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శైలజ, ఇన్‌చార్జ్ కార్యదర్శి ఈరలింగప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి

అగళి: మండల పరిధిలోని పి.బ్యాడగెర, మదుడి పంచాయతీల్లో వలంటీర్లు, ఆశావర్కర్లతో జగనన్న ఆరోగ్య సురక్షపై సమావేశం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలపై సర్వే చేయాలని ఎంఎల్‌ఓ ఓబులేష్ సూచించారు.

### ఏపీటీఎఫ్ కరపత్రాలు విడుదల

పెనుకొండ రూరల్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గుట్టూరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

### కాపర్ వైరు చోరీ

లేపాక్షి: కొండూరు జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఏఈ వెంకటేశులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### ఎగువ భద్ర యోజనను వేగవంతం చేయాలి

పావగడ: జస్టిస్ నంజుండప్ప నివేదిక ప్రకారం అత్యంత వెనుకబడిన పావగడ ప్రాంతంలోని చెరువులకు నీరు అందించాలి. రైతులకు మేలు చేకూర్చే ఎగువ భద్ర సాగు నీటి యోజన పనులను వేగవంతం చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ కోరారు. బెంగళూరులోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం సిద్ధరామయ్యను ఎమ్మెల్యే వెంకటేశ్ శుక్రవారం ఉదయం కలిశారు. ఈ సందర్భంగా తాలూకా అభివృద్ధిపై చర్చించారు. తాలూకా వ్యాప్తంగా పేదలకు గృహ సౌకర్యం కల్పించాలని కోరారు.

### మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు అందించాలి

మడకశిర: మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు నాగేంద్ర, రమేష్, నారాయణప్ప కోరారు. శుక్రవారం వారు విజయవాడలో మంత్రిని కలసి వినతిపత్రం అందించారు. కౌన్సిలర్ల గౌరవం వేతనం పెంచాలని కోరాగా మంత్రికి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు భారతరత్న అవార్డు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయవాడలో ఎమ్మెల్యే తిప్పేస్వామికి వినతిపత్రం అందించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

### నేటి నుంచి విద్యుత్ అంతరాయం

హిందూపురం అర్బన్: పట్టణంలో ఆదివారం గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ భూపతి తెలిపారు. పట్టణంలో 20 అడుగుల విగ్రహాలు 25 వరకు ఉన్నాయన్నారు. విగ్రహాల తరలింపులో జాప్యం జరగకుండా రోడ్డుకు ఇరువైపుల చెట్ల కొమ్మలు తొలగించడం, వైర్లు మార్పులు తదితర పనులు చేస్తున్నామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

### నేడు ఇంటర్వ్యూలు

పెనుకొండ: పట్టణంలోని శ్రీసత్యసాయి కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరుకు చెందిన అల్సెక్ టెక్నాలజీస్ కంపెనీ నిర్వాహకులు ఇంటర్వ్యూల్లో పాల్గొంటారన్నారు. ఏదేని డిగ్రీ పూర్తిచేసిన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు.

### దళితులపై దాడులు అరికట్టాలి

పెనుకొండ: దళితులపై దాడులను అరికట్టాలని సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలో సీపీఎం నాయకులు సమావేశం నిర్వహించి, దళితులపై జరుగుతున్న దాడులు, హత్యలు, భూఆక్రమణలపై ఖండించారు. ఈ మేరకు నాయకులు పోస్టర్లు విడుదల చేశారు. నాయకులు గంగాధర్, అన్నమయ్య, తిప్పన్న, వెంకటరాముడు, మైలారప్ప తదితరులు పాల్గొన్నారు.

### 25న మహాధర్నా

హిందూపురం టౌన్: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25న విజయవాడలో మహా ధర్నా తలపెట్టినట్లు సీఐటీయూ పట్టణ కార్యదర్శి నరసింహప్ప, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి లావణ్య అన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ నేతలు శిరీష, విజయమ్మ, నాగమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రొద్దం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-2లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు అదే గ్రామానికి చెంది, వివాహితులై ఉండాలన్నారు. పదోతరగతి ఉత్తీర్ణత పొంది, 2023 జూలై 1 నాటికి 21 ఏళ్లు నిండి, 35 ఏళ్లలోపు ఉండాలన్నారు. అర్హులు ఈనెల 29లోపు దరఖాస్తులను పెనుకొండ సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

### తక్షణసాయం అందజేత

అమరాపురం: మండలంలోని కెంకెర గ్రామానికి చెందిన రంగనాథ్ గత నెల నిద్రఘట్ట గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును శుక్రవారం మృతుడి భార్య లతమ్మకు ఎంపీపీ ఈరన్న అందజేశారు. మిగిలిన సొమ్ము బ్యాంక్ ఖాతాకు జమ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మంజునాథ్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అదనపు తరగతి గదుల ప్రారంభం

మడకశిర: పట్టణంలోని సరస్వతీ విద్యామందిరంలో నిర్మించిన రెండు అదనపు గదులను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంఈఓ భాస్కర్ ప్రారంభించారు. బెంగళూరు సౌత్ రోటరీ క్లబ్ వారి ఆర్థిక సహకారంతో రూ.20 లక్షల నిధులతో అదనపు గదులను నిర్మించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధి శ్రీధర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు లోకనాథ్, బాబుశంకర్, పాఠశాల ప్రతినిధులు గోపాలకృష్ణ, హనుమంతరెడ్డి, హెచ్‌ఎం పాల్గొన్నారు.

### త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

హిందూపురం: త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరమ్మకాలనీలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఆదినారాయణ, సభ్యులు మునీంద్ర, శేఖర్, గణేష్, సుభద్ర, కాలక్క, సరస్వతీ, పార్వతి పాల్గొన్నారు.

### సొసైటీల బలోపేతంపై అవగాహన

గోరంట్ల: స్థానిక సొసైటీ కార్యాలయంలో సత్యసాయి జిల్లా సహకార అధికారి కృష్ణానాయక్ ఆధ్వర్యంలో సొసైటీల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌డివిజనల్ అధికారి వసూర్‌స్వామి, గోరంట్ల, వానవోలు, సోమగట్ట సొసైటీల అధ్యక్షులు శివశంకర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, హనుమంతరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### కుస్తీ క్రీడాకారులకు సన్మానం

హిందూపురం: జాతీయ స్థాయి అండర్ 11/15 కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన హిందూపురం క్రీడాకారులకు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం సాయంత్రం ఆర్‌పీజీటీ రోడ్డు వద్ద కౌన్సిలర్ ఇర్షాద్ అహ్మద్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. శ్రీచరణ్, యాహియా, ధనుంజయలు వెండి, సయ్యద్, మిలాన్ కుమార్, ప్రణవ్, చందన కాంస్య పతకాలను సాధించినట్లు కోచ్ శ్రీరంగరాజుపల్లి ఆర్కే రమేష్, చరణ్ తెలిపారు.